# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 2 | సంచిక : 230 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | బుధవారం 12 నవంబర్ 2025




## జడ్జీలపై ఆరోపణలు చేయడం ట్రెండ్‌గా మారింది

- ఇలాంటి పరిణామాలు న్యాయవ్యవస్థ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తాయి
- వీటిని అడ్డుకోవాలి.. సుప్రీంకోర్టు ఆందోళన
- ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో వాదనలు వింటాం
- వివిధ అంశాలను ఏఐ వ్యవస్థలతో కావాల్సిన విధంగా మల్చుకునే ప్రమాదముంది

# పెట్టుబడులకు
# ఏపీ స్వర్గధామం

- ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి
- సీఎం చంద్రబాబు పిలుపు
- కనిగిరిలో ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- సీఐఐ సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే టార్గెట్
- గత పాలనలో పరిశ్రమలు రాష్ట్రం విడిచి పారిపోయాయన్న సీఎం
- 2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ



**అమరావతి**

యువత మంచి ఆలోచనలతో ముందుకు వస్తే, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 175 నియోజకవర్గాల్లో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన ప్రకటించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈ పార్కును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మరో 17 జిల్లాల్లో రూ.873 కోట్ల వ్యయంతో 868 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 49 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక - మిగతా3లో



## ప్రజాస్పందనను బలంగా వినిపిద్దాం

- రాష్ట్ర వ్యాప్త ర్యాలీలకు పార్టీలకతీతంగా అంతా కలిసి రావాలి
- పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై రేపు గట్టిగా పోరాటం చేద్దాం
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలదలో కేంద్రాల్లో ర్యాలీలను సూపర్ సక్సెస్ చేద్దాం
- జగన్ తెచ్చిన వైద్య విప్లవాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేశారు.

**తాడేపల్లి**

ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ర్యాలీలకు పార్టీలకతీతంగా అంతా కలిసి రావాలని పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. రేపు చేపట్టే ర్యాలీల ద్వారా ప్రజాస్పందనను గట్టిగా వినిపిద్దామన్నారు సజ్జల. ఈ మేరకు మంగళవారం (నవంబర్11వ తేదీ) వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో సజ్జల టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. - మిగతా3లో



## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

- ఇస్లామాబాద్ జ్యుడీషియల్ కాంప్లెక్స్ వద్ద భారీ పేలుడు
- ఈ ఘటనలో 12 మంది మృతి, 20 మందికి పైగా గాయాలు
- మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని గుర్తింపు
- గ్యాస్ సిలిండర్ పేలుడా, ఆత్మాహుతి దాడా అనే కోణంలో దర్యాప్తు
- దక్షిణ వజీరిస్థాన్‌లో కేడెట్ కాలేజీపై టీటీపీ దాడి విఫలం
- ఈ దాడితో తమకు సంబంధం లేదని ప్రకటించిన టీటీపీ


## ప్రమాదంలో ఢిల్లీ.. కేంద్రం కీలక ఆదేశాలు

- పూర్తిగా క్షీణించిన గాలినాణ్యత
- ఢిల్లీ అంటేనే గాలి కాలుష్యానికి మారుపేరులా మారింది
- చలి కాలంలో ఆ తీవ్రత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు
- ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి
- తదితర కారణాలతో ఆ ప్రాంతంలో తరచుగా గాలి నాణ్యత క్షీణిస్తూ ఉంటుంది



## సహకార రుణ రంగాన్ని విస్తరించడమే లక్ష్యం

- కేంద్ర మంత్రి అమిత్ షా
- అర్బన్ కో–ఆపరేటివ్ సెక్టార్‌లో ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇవ్వడాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు
- దేశంలోని 2,00,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పట్టణంలో వచ్చే ఐదేళ్లలో ఒక సహకార బ్యాంకు ఏర్పాటు
- గత రెండేళ్లలో ప్రభుత్వం ఎన్‌పీఏను 2.8 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గించేందుకు ఎన్నో చర్యలు తీసుకుంది



## కర్నూలు విమానాశ్రయంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు

- రాష్ట వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు
- ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం, పాలసీలను అమలుచేయడం వల్ల పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు
- కర్నూలు ఎయిర్పోర్ట్ లో మెల్ స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడం జరుగుతోంది



**కర్నూలు**

పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా కృషిచేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 50 ఎంఎస్‌ఎంఈ పార్కులకు కనిగిరి నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా కర్నూలు ఎయిర్ పోర్ట్ లో ఏర్పాటు చేస్తున్న ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ను ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ





## బిహార్‌లో ఎన్‌డీఏ జయకేతనం

- ఎన్డీఏ కూటమినే అధికారం చేపట్టబోతున్నట్లు మెజార్టీ సర్వేలు వెల్లడి
- పీపుల్స్ సర్వే, టైమ్స్ నౌ, ఆపరేషన్ చాణక్యలు ఎన్డీఏకే పట్టం
- ఎన్డీయే కూటమికి 46.2 శాతం ఓట్లు
- మహాఘట్ బంధన్ కు 37.9 శాతం
- నూతనంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి 9.7 శాతం

## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైంది

- తిరుపతి లడ్డూ కేవలం తీపి కాదు.. ఇది ఒక ఉమ్మడి భావోద్వేగం
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తిరుపతి లడ్డూని అప్యాయంగా స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపిణీ చేస్తాం
- తిరుపతి లడ్డూని ఇలా అందజేయడం వల్ల హిందువుల సమష్టి విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది
- సనాతర ధర్మ పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక బోర్డు అవసరం
- లౌకికతత్వం రెండు వైపులా ఉండాలి
- హిందువుల విశ్వాసంపై రక్షణ, గౌరవంపై చర్చించాల్సిన అవసరం ఉంది



**అమరావతి**

సనాతర ధర్మ పరిరక్షణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సనాతర ధర్మ పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక బోర్డు అవసరమని పవన్ కల్యాణ్ సూచించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు డిప్యూటీ సీఎం. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజానికి, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర కేంద్రం కంటే - మిగతా3లో



## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారు
- భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయి
- సెర్చ్ ఆపరేషన్ సమయంలో సంఘటనా స్థలంలో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తింపు

# బిహార్‌లో ఎన్‌డీఏ జయకేతనం

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వీటిలో ఎన్డీఏ కూటమినే అధికారం చేపట్టబోతున్నట్లు మెజార్టీ సర్వేలు వెల్లడించాయి. పీపుల్స్ సర్వే, టైమ్స్ నౌ, ఆపరేషన్ చాణక్యలు ఎన్డీఏకే పట్టం కట్టాయి.

**పీపుల్స్ పల్స్**

బిహార్‌లో ఎన్‌డీఏ జయకేతనం

బిహార్ లో బీజేపీ, జేడీయూ(యూ) నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి భారీ మెజారిటీతో అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నట్టు పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడయింది.

ఎన్డీయే కూటమి దాదాపు 8.3 శాతం ఓట్ల ఆధిక్యంతో మహాఘట్ బంధన్ మీద పైచేయి సాధించినట్లు పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడయ్యింది. నితీష్ కుమార్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళా రోజ్‌గార్ యోజన పథకం కింద కోటి 25 లక్షల మంది మహిళలకు రూ.10 వేల నగదు పంపిణీ చేయడం ఎన్డీఏ భారీ మెజారిటీ సాధించడానికి దోహదపడింది.

ఎన్డీయే కూటమికి 46.2 శాతం ఓట్లు, మహాఘట్ బంధన్ కు 37.9 శాతం, నూతనంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి 9.7 శాతం, ఇతరులకు 6.2 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది ఈ సర్వే ఫలితాల్లో మూడు శాతం 'ప్లస్ ఆర్ మైనస్' ఉండే అవకాశాలు ఉంటాయి




243 స్థానాలు ఉన్న బిహార్ శాసనసభలో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీయే కూటమికి 133-159 స్థానాలు, మహాఘట్ బంధన్ కూటమికి 75-101 స్థానాలు, ఇతరులకు 2 నుంచి 8 స్థానాలు, నూతనంగా ప్రారంభించిన జన్ సురాజ్ పార్టీకి 0-5 స్థానాలు వచ్చే అవకాశం ఉంది

**టైమ్స్ నౌ**

ఎన్డీయే 135-150 సీట్లు

మహాఘట్ బంధన్ 83-105 సీట్లు

జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిషోర్ పార్టీ)-1 సిటు

ఇతరులు 3-6 సీట్లు

**దైనిక్ భాస్కర్**

ఎన్డీయే 145-160 సీట్లు

మహాఘట్ బంధన్ 79-91 సీట్లు

జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిషోర్ పార్టీ)-0 సిటు

ఇతరులు 5-10 సీట్లు

**ఎస్ఏఎస్ గ్రూప్**

ఎన్డీయే 126-130 సీట్లు

మహాఘట్ బంధన్ 106-110 సీట్లు

జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిషోర్ పార్టీ)-7-10 సిట్లు

ఇతరులు 4-6 సీట్లు

# జడ్జీలపై ఆరోపణలు చేయడం ట్రెండ్‌గా మారింది

**న్యూఢిల్లీ:** తమకు అనుకూలంగా తీర్పులు రాని పక్షంలో లాయర్లు, కక్షిదారులు న్యాయమూర్తులపై అవమానకరమైన, అశ్లీలతతో కూడిన ఆరోపణలు చేయడం నేడు ట్రెండ్‌గా మారిపోయిందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పరిణామాలు న్యాయవ్యవస్థ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తాయని, వీటిని అడ్డుకోవాలనిప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తెలంగాణకు చెందిన కక్షిదారు పెద్ది రాజు, అతడి తరఫున వాదించిన ఇద్దరు లాయర్లపై ధిక్కార చర్యలను నిలిపివేస్తూ ఈ మేరకు పేర్కొంది. ఈ ముగ్గురూ తెలంగాణ హైకోర్టుకు క్షమాపణలు చెప్పడం, న్యాయస్థానం అంగీకరించడం జరిగినందున మళ్లీ విచారణ అవసరం లేదని తెలిపింది. అదేవిధంగా, న్యాయస్థానపు అధికారులుగా ఉన్న లాయర్లు ఈ కోర్టు లేదా ఏ హైకోర్టు న్యాయమూర్తులపై అయినా ఆరోపణలు చేసే పిటిషన్‌దారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తెలంగాణ హైకోర్టుకు చెందిన జస్టిస్ మౌసుమి భట్టాచార్యపై పెద్ద రాజు, అతడి ఇద్దరు లాయర్లు అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదం రేపింది.



**న్యాయవ్యవస్థలో ఏఐపై మార్గదర్శకాలు: సుప్రీం**

కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత దుర్వినియోగం అవుతుం డటంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు గదిలో విచారణ జరుగుతున్న సమయంలో తనపై ఓ లాయర్ షూ విసిరేసిన ఘటనను తప్పుగా చూపిస్తున్న ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై మార్గదర్శకాలు జారీ చేయాలంటూ అభినవ్ శ్రీవాస్తవ అనే లాయర్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో వాదనలు వింటామన్నారు. వివిధ అంశాలను ఏఐ వ్యవస్థలతో కావాల్సిన విధంగా మల్చుకునే ప్రమాదముందని పిటిషనర్ హెచ్చరించారు. ఏఐ వినియోగంతో అనేక అనూహ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. న్యాయవ్యవస్థ, న్యాయ విధులకు సంబంధించినంత వరకు ఏఐ నిష్పాక్షిక డేటాను కలిగి ఉండాలని, జవాబుదారీతనంతో కూడిన డేటా యాజమాన్యం పారదర్శకంగా ఉండాలని పిటిషన్ పేర్కొంది. లేకుంటే సైబర్ దాడుల ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించింది. అక్టోబర్ 6వ తేదీన రాకేశ్ కిశోర్ అనే లాయర్ విచారణ జరుగుతున్న సమయంలో సీజేఐ వైపు షూ విసరడం తీవ్ర కలకలం రేపింది.

# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ భారీ పేలుడుతో దద్దరిల్లింది. మంగళవారం నాడు నగరంలోని జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన శక్తిమంతమైన పేలుడులో కనీసం 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇది ఆత్మాహుతి దాడి అని భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసి ఉన్న ఓ కారులో ఈ పేలుడు సంభవించింది. ఇది అత్యంత రద్దీగా ఉండే సమయం కావడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కారులోని గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని భావిస్తున్నా, ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల పార్క్ చేసిన అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమారు 6 కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు. "నేను నా కారు పార్క్ చేసి కాంప్లెక్స్‌లోకి వెళుతుండగా, గేటు దగ్గర పెద్ద శబ్దం వినిపించింది. అక్కడ రెండు మృతదేహాలు పడి ఉన్నాయి.



అనేక కార్లు మంటల్లో కాలిపోతున్నాయి" అని రుస్తుమ్ మాలిక్ అనే న్యాయవాది ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు వివరించారు. ఈ ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**పెషావర్ తరహా దాడికి కుట్ర భగ్నం**


ఈ పేలుడుకు కొన్ని గంటల ముందే దక్షిణ వజీరిస్థాన్‌లో పాక్ భద్రతా దళాలు ఓ ఉగ్రకుట్రను భగ్నం చేశాయి. వానాలోని కేడెట్ కాలేజీపై తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు చేయబోయిన దాడిని భద్రతా దళాలు అడ్డుకుని, ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. 2014లో పెషావర్‌లోని ఆర్మీ స్కూల్‌పై జరిగిన తరహా దాడినే పునరావృతం చేయాలని ఉగ్రవాదులు ప్రయత్నించారని పాక్ సైన్యం వెల్లడించింది. ఆనాటి దాడిలో 154 మంది ప్రాణాలు కోల్పోయారు. గత కొంతకాలంగా పాకిస్థాన్ టీటీపీ ఉగ్రవా దుల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత పాక్‌లో టీటీపీ కార్యకలాపాలు పెరిగాయి. టీటీపీ నాయకులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తుండటంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

## సహకార రుణ రంగాన్ని విస్తరించడమే లక్ష్యం

పట్టణ సహకార రుణ రంగాన్ని విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. దేశ రాజధానిలో జరిగిన 'అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సెక్టార్, కో-ఆప్ కుంభ్ 2025' అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోని 2,00,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పట్టణంలో వచ్చే ఐదేళ్లలో ఒక సహకార బ్యాంకు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. అర్బన్ కో-ఆపరేటివ్ సెక్టార్‌లో ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు ఇవ్వడాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్‌షా చెప్పారు. భాగస్వామ్య యాజమాన్య నమూనా ఆధారంగా వ్యాపారాన్ని విస్తరించే లక్ష్యంలో భాగంగా ఈ సదస్సులో రూపొందించిన 'ఢిల్లీ డిక్లరేషన్ 2025' రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**ఎన్‌పీఏల తగ్గింపు**

గత రెండేళ్లలో పట్టణ సహకార బ్యాంకుల నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గాయని అమిత్‌షా హైలైట్ చేశారు. గత రెండేళ్లలో ప్రభుత్వం ఎన్‌పీఏను 2.8 శాతం నుంచి 0.6 శాతానికి తగ్గించేందుకు ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. సహకార రంగంలోని రుణదాతలు ఆర్థిక డిజిటల్ సాంకేతి కతలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'సహకార్ డిజీ-పే', 'సహకార్ డిజీ-లోన్' యాప్‌లు డిజిటల్ విప్లవంలో సహకార రంగం భాగస్వామ్యానికి గుర్తింపు ఇవ్వనున్నాయని చెప్పారు.



**యువత, బలహీన వర్గాల సాధికారత కోసం..**

యువ పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక బృందాలు, సమాజంలోని బలహీన వర్గాల సాధికారత కోసం పట్టణ సహకార బ్యాంకులు చర్యలు చేపట్టాలని మంత్రి సూచిం చారు. 'సహకార సంఘాలను బలోపేతం చేయడం, అదే సమయంలో బలహీన వర్గాలకు దన్నుగా నిలవడం మా లక్ష్యం. పట్టణ సహకార బ్యాంకులు తప్ప మరే సంస్థ దీన్ని సాధించలేదు' అని ఆయన నొక్కి చెప్పారు. ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించడానికి ఈ రంగాన్ని విస్తరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయంలో ఉమ్మడి విధానాన్ని రూపొందించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు.

**సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సహకార రంగాన్ని డిజిటలైజ్ చేయడానికి, ఈ విభాగంలో సేవలు విస్తరించడానికి కేంద్రం అనేక మార్పులను తీసుకువచ్చింది. జులై 2021లో మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలో సహకార మంత్రిత్వ శాఖను సృష్టించింది. జాతీయ స్థాయి సహకార సంఘాల పాలనను మెరుగుపరచడానికి గత సంవత్సరం పార్లమెంటు బహుళ-రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) చట్టం, 2022ను కూడా ఆమోదించింది.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకు ఆరుగురు మావోలు మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాల బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొందని.. ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారని.. భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయని ఎస్పీ పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి కాల్పులు జరుగుతున్నట్లుగా ఆయన వివరించారు. డీఆర్‌జీ బీజాపూర్, దంతేవాడ, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు. సెర్చ్ ఆపరేషన్ సమయంలో సంఘటనా స్థలంలో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇన్సాస్, స్టెన్‌గన్, 303 రైఫిల్స్‌తో పాటు ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పీ మాట్లాడుతూ డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్, సీఏఎఫ్ దళాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపినట్లు ఐజీ పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ నలుగురు నక్సల్స్‌ను సంఘటనా స్థలంలోనే అరెస్టు చేసినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ పేర్కొన్నారు. సంఘటనా స్థలంలోనే వారికి చికిత్స అందించి.. అంబులెన్స్ ద్వారా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

## ప్రమాదంలో ఢిల్లీ.. కేంద్రం కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. ఈ రోజు ఉదయం గాలి నాణ్యత పూర్తిగా క్షీణించి (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)లో 425కి చూపించడంతో కేంద్రం తక్షణ చర్యలకు ఉపక్రమించి నిషేదాజ్ఞాలు విధించింది. ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపింది.

**పూర్తిగా క్షీణించిన గాలినాణ్యత**

ఢిల్లీ అంటేనే గాలి కాలుష్యానికి మారుపేరులా మారింది. చలి కాలంలో ఆ తీవ్రత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఢిల్లీలో ఉన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితులతో పాటు అధిక స్థాయిలో వాహనాలు వాడడం, పంట వ్యర్థాలను కాల్చివేయడం, తదితర కారణాలతో ఆ ప్రాంతంలో తరచుగా గాలి నాణ్యత క్షీణిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 362 గా ఉన్న గాలి నాణ్యత మంగళవారం ఉదయం మరింతగా క్షీణించి 425కు చేరి తీవ్ర ప్రమాదకర స్థాయికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన కేంద్రం పలు నిషేదాజ్ఞాలు జారీ చేసింది.

అత్యవసరమయితే తప్ప నిర్మాణాలు చేపట్టడం లేదా కూల్చివేయడం నిషేదమని తెలిపింది.

రాజధాని పరిసర ప్రాంతాలలోని అన్ని మైనింగ్ కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది.

బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డిజీల్ వాహనాలు రోడ్లపై తిరగడం నిషేదం.( దివ్యాంగులకు మినహాయింపు)

5వ తరగతి వరకూ పాఠశాలలు హైబ్రీడ్ మోడల్ లో క్లాసులు నిర్వహించాలని తెలిపింది. వీలైతే విద్యార్థులు క్లాసులు ఆన్?లైన్ మోడల్?లో వినాలని సూచించింది.

ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ కొలతలు

స్టేజ్-1 తక్కువ (200-300)

స్టేజ్-2 మరింత తక్కువ (301-400)

స్టేజ్-3 ప్రమాదకరస్థాయి (401-450)

స్టేజ్-4 తీవ్రప్రమాదకరం( 450 ప్లస్)

## ఢిల్లీ పేలుడు కేసు ఎన్‌ఐఏకి అప్పగింత



రాజధాని ఢిల్లీలో పేలుడుతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిత్యం రద్దీగా ఉండే చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 12 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 17 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక ఈ పేలుడు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగించారు. పేలుడు ఘటనపై ఎన్‌ఐఏ త్వరలో నివేదిక ఇవ్వనుంది. మరోవైపు పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. నిన్న తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇవాళ మరో ముగ్గురు మరణించినట్లు ఢిల్లీ పోలీసులు మంగళవారం ప్రకటించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 12కి పెరిగింది. ఇదిలా ఉండగా.. పేలుడు ఘటనపై యూఏపీఏ చట్టం కింద ఢిల్లీ పోలీసులు కేసు బుక్ చేశారు. కోత్వాలి పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16, 18 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కూడా కేసులు బుక్ చేశారు. ప్రస్తుతం పలు ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని హై అలర్ట్‌లో ఉన్నది. ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్, బస్ టర్మినల్ల వద్ద బందోబస్తు పెంచారు.

# కర్నూల్ లో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ శంకుస్థాపన చేసిన మంత్రి అచ్చన్న నాయుడు






కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):

కర్నూలు ఎయిర్ పోర్ట్ లో ఏర్పాటు చేస్తున్న ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు వర్చివల్ గా శంకుస్థాపన చేసినారు, ఈసందర్భంగా కర్నూలు ఎయిర్పోర్ట్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి అచ్చెన్నాయుడు తో కలిసి కొడుమూరు ఎంఎల్ఏ శ బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు .ఈ సందర్భంగా మంత్రి వర్యులు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు వర్చువల్ ఎం ఎస్ ఎం ఈ పార్కులను ప్రారంభించనుంచనున్నారని అన్నారు..కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎం ఎస్ ఎం ఈ) అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం ప్రతి జిల్లాలో పరిశ్రమ పార్కులు (ఎం ఎస్ ఎం ఈ పార్కులను) ఏర్పాటు చేస్తోంది అని అన్నారు.ఈ పార్కుల లక్ష్యమును వివరిస్తూ స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల వికేంద్రీకరణ చేయడం ఉత్పత్తి, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి సేవలకు ఒకే చోట సదుపాయాలు కల్పించడం,మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం.ప్రతి పార్క్లో భూసమీకరణ, రహదారి, నీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఇన్క్యుబేషన్ సెంటర్లు వంటి మౌలిక వసతులు కల్పించబడతాయి అని అన్నారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రం పరిశ్రమల హబ్గా ఎదగడం, అలాగే స్థానిక ఆర్థికాభివృద్ధి సాధించడం లక్ష్యం అని అన్నారు.

## జగన్ ని కలిసిన బొట్లా రామారావు

తాడేపల్లి, (శుభోదయం న్యూస్):



మాజీ ముఖ్యమంత్రి మరియు వైఎస్సార్సీపీ అధినేత శ్రీ వై ఎస్ జగన్ మెహన్ రెడ్డిని తాడేపల్లి లోని కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మరియు దర్శి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గముల పరిశీలకులు బొట్లా రామారావు.

## చిదరాల దుర్గా పార్వతి మధుబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో -మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే చిర్రి

పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):





చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీదరాల దుర్గా పార్వతి మధుబాబు ప్రమాణస్వీకార కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ "రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని, మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. నూతన ఏఎంసి చైర్మన్ దుర్గా పార్వతి మధుబాబు లకు శుభాకాంక్షలు తెలిపి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరుకుంటున్నామని," అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కొలికపూడి గోవిందరావు, జిల్లా కార్యదర్శి ప్రధాన కార్యదర్శులు గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి, చింతలపూడి మాజీ శాసనసభ్యులు గంట మురళి, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, చింతలపూడి ఎమ్మెల్యే సొంఘ రోషన్ కుమార్, టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, కూటమి నాయకులు,తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కారంపూడి మండల టీడీపీ అధ్యక్షుడిగా గోళ్ల సురేష్ యాదవ్ ప్రమాణ స్వీకారం మాచర్లలో బుధవారం ఘనంగా కార్యక్రమం

కారంపూడి, జర్నలిస్ట్ ఆర్కే (శుభోదయం న్యూస్):



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశీస్సులతో కారంపూడి మండల టీడీపీ అధ్యక్షుడిగా గోళ్ల సురేష్ యాదవ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం మాచర్లలోని మనుకొండ కళ్యాణమండపంలో నిర్వహించబడుతుంది. అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యానికి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కమిటీ కన్వీనర్లు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరుకానున్నారు. మండల, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు కూడా ఈ వేడుకలో భాగంగా నిర్వహించనున్నట్లు సురేష్ యాదవ్ తెలిపారు. విజయవంతం చేయాలని పిలుపు నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలు నిలిపితే జరిమానాలు తప్పవు బాపట్ల పట్టణ సిఐ రాంబాబు

బాపట్ల జిల్లా(శుభోదయం న్యూస్):



పట్టణ ప్రధాన రహదారులలో రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలు నిలిపితే జరిమానాలు తప్పవని బాపట్ల పట్టణ సిఐ రాంబాబు అన్నారు.బాపట్ల పట్టణంలో మంగళవారం పట్టణ సిఐ రాంబాబు ,ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బందితో కలిసి ప్రధాన రహదారుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు,ఈ సందర్భంగా పట్టణ సీఐ రాంబాబు మాట్లాడుతూ.బాపట్ల పట్టణంలో ప్రధాన రహదారులలో రోడ్లను ఆక్రమించి వాహనాలు నిలపరాదని అట్లు నిలిపిన వాహనాలకు జరిమానా విధించబడుతుందని సీఐ అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనదారులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అదేవిధంగా పట్టణంలో అతివేగంగా వాహనాలు నడుపుకుంటూ వెళ్లరాదని యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్కు అంతరాయం కలిగించే విధంగా రోడ్లపై నిలిపిన వాహనాలకు సీఐ జరిమానా విధించామని అన్నారు. ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది సీఐతో ఉన్నారు.

## ప్రజలు భద్రతే మా లక్ష్యం డక్కిలి సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్

వెంకటగిరి నియోజకవర్గం, ఇంచార్జ్ విసి సుబ్బరాయుడు(శుభోదయం న్యూస్):



తిరుపతి జిల్లా డక్కిలి మండలం మంగళవారం వెంకటగిరి రాపూరు రహదారిపై డక్కిలి సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్ వాహనాలు తనిఖీలు నిర్వహించారు అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కొరకే పోలీసులు పనిచేస్తున్నారని కావున ప్రజలు పోలీస్ లకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా వాహనదారులు హెల్మెంట్, సీటబెల్ట్ కచ్చితంగా ధరించాలని కోరారు. ప్రతి రోజు తనిఖీలో భాగంగా వాహనదారులకు హెల్మెంట్, సీటబెల్ట్ ధరించడంపై అవగాహనా కల్పిస్తూ ఉన్నామని. చాలా మంది వాహన దారులు హెల్మెంట్, సీటబెల్ట్ దరిస్తూ వాహనాలు నడుపుతు న్నడం చాలా సంతోషకారంగా ఉందని తెలియజేసారు. ఐతే కొంతమంది ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, డ్రంక్ చేసి డ్రైవ్ లో పట్టుపడుతున్నారని అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తూ చలాన్ల మోత మొగిస్తున్నామని తెలియజేసారు. తనిఖీలో భాగంగా పోలీస్ లు ప్రతిరోజూ నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమం ద్వారా చాలామంది వాహన దారులు నిబంధనలు పాటిస్తున్నారని పోలీస్ లు ప్రజల రక్షణ కొరకు కొన్ని కఠినమైన చర్యలు తీసుకొంటుందని కావున ప్రజలు కూడా పోలీస్ లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గురవయ్య, వెంకటరమణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల తహసిల్దార్

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం(శుభోదయం న్యూస్):




సి బెళగల్ మండల కేంద్రంలోని రేషన్ షాపులను మండల తహసిల్దార్ ఈ వెంకటలక్ష్మి తనిఖీ చేశారు గ్రామంలోని రేషన్ షాప్ నంబర్ 4 5 7 షాపులను తనిఖీ చేస్తూ లబ్ధిదారులతో డీలర్లతో మాట్లాడుతూ తంబు వేసుకుని రేషన్ తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు ఈరోజు 10వ తేదీ అయినా షాపులలో రేషన్ సరుకులు ఎక్కువగా ఉన్నట్లు ప్రశ్నించారు ప్రతినెల 1వ తేదీ నుండి 15వ తేదీలోగా ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను తంబు వేయించుకొని సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని మండల తహసిల్దార్ ఈ వెంకటలక్ష్మి హెచ్చరించారు, తాసిల్దారు వెంట మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తరుణ్, వీఆర్వోలు వీఆర్ఏలు ఉన్నారు.

## 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

జీలుగుమిల్లి(శుభోదయం న్యూస్):



జీలుగుమిల్లి సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కష్టపడి ఉత్పత్తి చేసిన ధాన్యానికి సరైన మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం పోలవరం నియోజకవర్గం అంతటా మొత్తం 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ప్రతి కేంద్రంలో సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, సొసైటీ చైర్ పర్సన్ సరిపెల్లి సత్యనారాయణ రాజు, మెంబెర్ వెలగల అజయ్, సర్పంచ్ చిర్రి జగదాంబ, ఎంపీపీ పోశమ్మ, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, బీజేపీ జిల్లా నాయకులు చాట్రాతి ప్రసాద్, నాయకులు పద్దం వెంకటకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడి బుజ్జిబాబు, ఏవోలు గంగాధర్, ఏఈఓ బాలాజీ, సొసైటీ అధికారులు పసల జయంత్, జగదీష్, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోపూరు వెంకట రమణారెడ్డికు నివాళులర్పించిన నేదురుమల్లి

వెంకటగిరి నియోజకవర్గం, ఇన్చార్జ్ విసీ సుబ్బరాయుడు(శుభోదయం న్యూస్):



తిరుపతి జిల్లా డక్కిలి మండలం మొపూరు గ్రామ పంచాయతీకి చెందిన వైయస్సార్సీపి నాయకులు మోపూరు వెంకటరమణారెడ్డి వారం రోజులు క్రితం మరణించినారని తెలుసుకొని మంగళవారం వారి ఇంటికి వెళ్లి వారి కుమారుని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మీ కుటుంబానికి వైయస్సార్సీపి పార్టీ అన్ని వేళల్లో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట డక్కిలి మండల నాయకులు, వైయస్సార్సీపి మండల అధ్యక్షులు చింతల శ్రీనివాసులు రెడ్డి, దేవులపల్లి మాజీ సర్పంచ్ మదమాల నారాయణరెడ్డి, కమ్మపల్లి వేణు నాయుడు, శ్రీహరి రెడ్డి, బాలకృష్ణ నాయుడు, బండి రమేష్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

## బ్రహ్మంగారిమఠంలో ఏర్పాటు చేసిన కీర్తన పిన్ సర్వే లిమిటెడ్ (గోల్డ్ లోన్స్) కార్యక్రమం

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):




బ్రహ్మంగారిమఠం మండలంలో ఈరోజు ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు చెన్ను పల్లె సుబ్బారెడ్డి, సహకార సంఘం చైర్మన్ సాంబశివారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, ఎస్ ఆర్ శ్రీనివాసులరెడ్డి, భూమిరెడ్డి పాలసుబ్బారెడ్డి తదితరులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మజా రెడ్డి ఎండి, శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, విశ్వనాధ రెడ్డి, రాజేష్ ఆశీర్వాదం, వెంకట ప్రభు తో సహా కార్యాలయ ఉద్యోగులు ,సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పూలమాలను వేసిన ఎమ్మెల్యే డాక్టర్ సుధా పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి
(శుభోదయం న్యూస్):

ఈరోజు బద్వేల్ మున్సిపాలిటీ నందు అంబేద్కర్ సర్కిల్ విగ్రహం దగ్గర కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షు డు. సింగమాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్వేల్ శాసన సభ్యురాలు డాక్టర్ శ్రీమతి సుధా మాజీ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం నిర్ణయించుకోవడం తన అనుయులకు అప్పనంగా అప్పజెప్పడం జరుగుచున్నదని. వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 17 జిల్లాలకు జిల్లాకు ఒకటి చొప్పున 8 480. వేల కోట్లు మంజూరు చేయడం జరిగిందని అందులో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించడం జరిగిందని రెండు మెడికల్ కళాశాలలు పులివెందల పాడేరు పూర్తి చేసి ఎలక్షన్ కోడ్ వల్ల ప్రారంభించ లేకపోయారని మిగతా మెడికల్ కళాశాలలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని కేవలం 5000 కోట్లు ఖర్చుపెట్టి అవుతాయని . ఇందుకు నా బాధ ద్వారా పూర్తి గా శాంక్షన్ చేయడం జరిగిందని. ఇప్పుడు లక్షల కోట్ల ప్రాపర్టీని తన అన్యులకు లాభం వచ్చే విధంగా చేయడం జరుగుతుందని. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అట్టకెక్కిందని.



గతంలో10 59 రకాలజబ్బులకు. ఉండేదని జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత 3250 రకాల జబ్బులకు పెంచడం జరిగిందని ఆరోగ్యశ్రీని 25 లక్షల వరకు కంచడం జరిగిందని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఇటు ప్రజలకు అటు. విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ చదవాలన్న సీటు దక్కించుకోవాలన్నా కష్టమవుతుందని అందువల్లనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రజా ఉద్యమంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు రాజీవ్ బాషా. బద్వేల్ మున్సిపాలిటీ కన్వీనర్ సుందర్ రామిరెడ్డి. బద్వేల్ మండల చైర్మన్ రాజగోపాల్ రెడ్డి. బద్వేల్ కన్వీనర్ రామసుబ్బారెడ్డి. డాక్టర్ మునయ్య . మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సాయి కృష్ణ. ఎక్కడో లేవరు ఉన్నారు. కేశవరెడ్డి. కృష్ణారెడ్డి లక్కినేని ఓబయ్య. కడుగు బాబు. పుల్లయ్య . నారాయణ.ఎస్సీ సెల్ నాయకులు. వైఎస్ఆర్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలోని ఎస్టీ ల సమస్యలను పరిష్కరించండి

**సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్**

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి
(శుభోదయం న్యూస్):



మండలంలోని ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెదుల్లపల్లి ప్రభాకర్ కోరారు. మంగళవారం బ్రహ్మంగారి మఠం మండలంలోని మడమాల గ్రామపంచాయతీలోని కేశవపురం ఎస్టీ కాలనీ సిపిఐ బృందం సందర్శించారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దుళ్లపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ..... కేశవ పురం గ్రామంలోని ఎస్టీ కాలనీ నందు దాదాపు 20 కుటుంబాలు ఎస్టీలు నివసిస్తున్నారని వారు ఏళ్ళ తరబడి నివసిస్తున్న ఒక్క ఇంటిలో రెండు మూడు కుటుంబాలు నివాసం ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీలకు ఉపాధి లేక వేరే ప్రాంతాలకు వలస వెళ్లి పనులు చేసుకుంటున్నారని వారికి కుటుంబా నికి మూడు ఎకరాలు సాగుభూమి, ఇంటి స్థలము, ఇల్లు ఇవ్వాలని ఆయన కోరారు, ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల పక్కన చెరువు ఉండటంతో గతంలో ఆ చెరువులోని నీరు ఇళ్లలోకి రాకుండా అడ్డుగా కట్ట వేపించారని కొందరు స్వార్ధపరులు ఆ కట్టను తొలగించి చదును చేశారని, అదేవిధంగా ఆ గ్రామంలో మిగతా కుటుంబాలు ఇల్లు నిర్మించుకోవడానికి కొంత ఖాళీ స్థలము పెట్టుకుంటే ఆ స్థలమును కూడా కబ్జా చేసి మట్టితోలి ప్లాట్లు ఏర్పాటు చేసుకుంటున్నారని, ఇదేమని అడిగిన ఎస్టీలను మీకు దిక్కున చోటు చెప్పుకోండి అంటూ వాళ్ళను బెదిరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ ఇళ్ల చుట్టూ మట్టి తోలించి ఇళ్లలోకి నీరు రాకుండా చేయాలని, అదేవిధంగా పక్కా ఇల్లు నిర్మించి మూడు ఎకరాల సాగుభూమి మంజూరు చేసి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా సర్వేనెంబర్ 334, 335లో కందకాలను తొలగించే పనిలో భూకబ్జాదారులు ఉన్నారని దానిని కూడా రెవెన్యూ అధికారులు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు సోమిరెడ్డిపల్లె నారాయణ, చేజర్ల రవి ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పెదుల్లపల్లి మల్లేష్, నాగిపోగు రాజన్న, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## మండలంలోభూ కబ్జాలు అరికట్టండి డిప్యూటీ తాసిల్దార్ కు వినతి

సిద్ధవటం మండల, విలేకరి జాకీర్ హుస్సేన్
(శుభోదయం న్యూస్):

ప్రభుత్వ, స్థలాలు, కనబడితే భూ కబ్జా చేసేందుకు కొంతమంది పెట్రేగిపోయి, యంత్రాలతో చదును చేసి భూకబ్జాయత్నం చేస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తాసిల్దార్ మాధవి లత కు వినతిపత్రం సమర్పించారు సిద్ధవటం మండలంలోని మాధవరం 1 ఎస్ కే ఆర్ నగర్ గ్రామంలోని పెద్దపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 10 69/2 నందు కొంత భాగం స్థలాన్నిజెసిబి యంత్రాలతో చదును చేసి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు భూ కబ్జా యత్నం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రమైన సిద్ధవటం లోని తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం చేనేత కార్మికులు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సర్పంచ్ జానకి రామయ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గ్రామంలో కొలువుతీరిన శ్రీ శీతల గంగమ్మ తల్లి, శ్రీ మహాలక్ష్మి దేవి, గ్రామదేవతల జాతర మహోత్సవ కార్యక్రమాలు జరిగే కార్యక్రమంలో భాగంగా



30 ఏళ్లగా ఈ స్థలంలో దేవత మూర్తుల సంబంధించి కార్యక్రమాలు జరుగుతున్నాయని కొంతమంది గుర్తు తెలి యని వ్యక్తులు జెసిబి యంత్రాలతో చదును చేసిఅధికారులు స్థలాన్ని ఇళ్ల పట్టాలకు మంజూరు చేశారంటూ చదును చేసి భూ కబ్జా యత్నం చేస్తున్నారని అధికారులు పరిశీలించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో, ఎస్ శివ కేశవులు, సి నర్సింహులు, జింక శ్రీనివాసులు, సురేష్ బాబు, బి ఓబులేసు ఎస్ వెంకటేష్ మునిచంద్ర తదితరు చేనేత కార్మికుల పాల్గొన్నారు.

## విద్యార్థిపై దాడి చేయడం హేయమైన చర్య జిల్లా కన్వీనర్, అనిల్ కుమార్

సిద్ధవటం మండల, విలేకరి జాకీర్ హుస్సేన్
(శుభోదయం న్యూస్):

విద్యార్థులకు చదువులు చెప్పే ఉపాధ్యాయులు విద్యార్థుల పై దారులు చేయడం పిరికిపంద చర్య అంటూ కడప జిల్లా అఖిలభారత విద్యార్థుల సంఘం జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్ మండిపడ్డారు సిద్ధవటం మండలంలోని మాధవరం, 1, పార్వతీపురం గ్రామంలోని ఎస్పీ డివిడి ఎయిటేడ్ సభ హై స్కూల్ నందు తోటి విద్యార్థుల కోసం బెటాలియన్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న శశాంత్ అనే విద్యార్థి తన స్నేహితుల కోసం సోమవారం ఎస్పీ బీవీడీ స్కూల్ లోకి వెళ్లగావిద్యార్థి పై స్కూల్ కరస్పాండెంట్ దాడి చేశారంటూ సమాచారం రావడంతో మంగళవారం అఖిలభారత విద్యార్థుల సంగం జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్ గాయపడ్డ విద్యార్థి కుటుంబానికి వెళ్లి పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరం గ్రామం రోడ్ నెంబర్ 6 నందు నివాసమున్న సుశాంత్ అనే విద్యార్థి పై ఎస్పీ పి వి డి కరస్పాండెంట్ మధుసూదన్ ఇతనిపై విద్యార్థి అని



చూడకుండా చితక కొట్టడం వల్ల బలమైన గాయాలు తగిలాయని తోటి స్నేహితుల కోసం సరదాగా స్కూల్ కి వస్తే విద్యార్థిపై దాడి చేయడం సబబు కాదని చదువులు చెప్పవలసిన గురువులే విద్యార్థులపై మానసికంగా దాడి చేయడం పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ సురేష్, ప్రసాదు, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వర్చ్యువల్ విధానంలోగంగపాలెం లో పార్కు ప్రారంభోత్సవం వీక్షించిన ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు ,పార్టీశ్రేణులు ,అధికారులు

ఎర్రగొండపాలెం మండల, రిపోర్టర్ నారాయణ
(శుభోదయం న్యూస్):

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనిగిరి లోని పెద ఈర్లపాడులో ఎం.ఎస్ఎం.ఈ పార్కులను వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాలలో 50 ఎంఎస్ఎంఈపార్కులకు శంఖుస్దాపనలు చెసిన విషయం విధితమే ఆ శంఖుస్దాపనలలో యర్రగొండపాలెం మండలం సర్వాయిపాలెం గ్రామం గంగపాలెం రెవిన్యూ ఇలాఖ లో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీయల్ పార్క్ఉండటం తెలిసిందే అ శంఖుస్దాపనల ప్రారంబోత్సవాలను యర్రగొండపాలెం నియోజక వర్గంలోని ఐదు మండలాలలకు చెందిన అధికారులు తెలుగుదేశం పార్టీ నియోజక వర్గం లోని నాయకులు పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనిగిరిలో గావించిన శంకుస్థాపన కార్యక్రమమాన్ని లైవ్ లో వీక్షించారు అనంతరం గంగపాలెం రెవిన్యూ ఇలాఖాలోని ఎంఎస్ఎంఈ పార్కుకోసం కేటాయించిన 40 ఎకారాల భూమి లో 8 కోట్ల రూపాయాలతో నిర్మిస్తున్న పార్కు వద్ద శంకుస్థాపన శిలాఫలకంను యర్రగొండపాలెం నియోజకవర్గ



తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అవిష్కరించారు ఈకార్యక్రమంలో ఇంచార్జ్ సబ్ కలెక్టరు శివరామిరెడ్డి తహాశీల్దారు మంజునాధరెడ్డి యంపిడివో బండారు శ్రీనీవాసారావు మార్కెట్ యార్డు చైర్మన్ చెకూరి సుబ్బారావు మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి లతో పాటు అధికారులు పాల్గొన్నారు

## భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలి -వ్యవసాయ అధికారి

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం(శుభోదయం న్యూస్):




సి.బెళగల్ -1 రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తుందనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ నిర్వహించారు, ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వివిధ పంటలలో సమగ్ర సస్యరక్షణ చర్యలు మరియు రైతులకు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యొక్క వాడకాన్ని వినియోగించుకోవాలని రైతులకు తెలియజేశారు, అదేవిధంగా రైతులకు భూమిలో ఉండే వివిధ మూలకాల ఆవశ్యకతను మరియు నత్రజని, భాస్వరం ,పోటాష్ ఎరువుల యొక్క ప్రాధాన్యతను భూసార పరీక్ష ఫలితాల పత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా రైతు సేవా కేంద్రాల యందు ఎరువులు మరియు యూరియా రైతు సేవ కేంద్రం లో 80 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు రైతులకు సమృద్ధిగా ఎరువుల కొరత లేదని రైతులకు తెలియజేశారు. ప్రైవేట్ డీలర్స్ నందు కూడా యూరియా మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఏఈవోలు మరియు విహెచ్ఏ అంజలి,ఎం పి ఓ లు సునంద, రైతులు నరసింహ, మాలన్న ,రాముడు పాల్గొన్నారు.

## దోషులకు శిక్ష తప్పదు. ఢిల్లీ పేలుళ్ల ఘటనపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్):



ఏలూరు/ ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనను తీవ్రంగా ఖండించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ.. ఢిల్లీ పేలుడు ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ దుర్ఘటనలో 12 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు ఉగ్రవాదులైనా, మరెవరైనా సరే శిక్ష అనుభవించక తప్పదని, ప్రజలెవరూ భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడం కోసం ఎంతవరకైనా వెళ్లి పోరాడతామని ప్రధాని మోదీ ఇప్పటికే చెప్పారని, కారు బాంబు పేలుళ్ల కారకులకోసం భద్రతా దళాలు గాలిస్తున్నాయని, త్వరలోనే నేరస్థులను పట్టుకోవడం జరుగుతుందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన ప్రకటనలో వెల్లడించారు.

## పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్యకు ప్రశంసా పత్రం

గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):



పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్యకు జిల్లాఎస్పీ జగదీష్ మంగళవారం అతని సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాన్ని ఎస్పీ కార్యాలయంలో అందజేశారు సిఏ రామసుబ్బయ్య గతంలో గుంతకల్లు సిఐ గా పని చేసినప్పుడు కూడా ఎన్నో కేసులను ఛేదించారు అసాంఘిక కార్యకలాపాలపైవంటి వాటిపై ఉక్కు పాదం మోపారు ఆయనకు ఈ అవార్డు రావడం పట్ల పలువురుహర్షం వ్యక్తం చేస్తున్నారు

## సమాచార హక్కు చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య

గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):






సమాచార హక్కు చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఇది 2005లో ఏర్పాటు చేశారని విద్యార్థులు దీని గురించి విపులంగా తెలుసుకోవాలని ఎస్ కే పి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ లక్ష్మయ్య పేర్కొన్నారు మంగళవారం కళాశాలలో సమాచార హక్కు చట్టంపై ఒక కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తించాల న్నారు ఈ కార్యక్రమంలో ఆర్టిఐ డాక్టర్ గోపి నాయక్, న్యాయవాది తిమ్మప్ప ,విమెన్ ఎంపరిమెంట్ సెల్ కోఆర్డినేటర్ వాణిశ్రీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జమీల, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజశేఖర్, శ్రీనివాసులు, శంకర్, అంతోని రాజ్ ,పాల్గొన్నారు

## విధులను బహిష్కరించిన గుంతకల్ న్యాయవాదులు

**గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):**




గుంతకల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించారు రాజశేఖర్ అనే న్యాయవాదిపై ఈనెల 7న పుత్తూరు కోర్టు ప్రాంగణంలో ప్రత్యర్థి క్లైంట్ కారుతో గుద్ది హత్య ప్రయత్నం చేసినందుకు రెండు రోజులపాటు విధులను బహిష్కరిస్తున్నట్లు వారు అసోసియేషన్ న్యాయవాదులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జయరాం సీనియర్ న్యాయవాది మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు బిఎస్ కృష్ణారెడ్డి సీనియర్ న్యాయవాదులు వెంకటేశ్వర్లు, భాస్కర్ గౌడ్ ,వెంకట నాయుడు, బడే సాబ్ ,గోపాలకృష్ణ, గురు ప్రసాద్, వెంకటేశులు, చంద్రశేఖర్, తిమ్మప్ప ఈదుర్వలి, శివరావు, నరసింహారావు, మస్తాన్, పార్వతి తదితరులు పాల్గొన్నారు

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ.

**కనేకల్ మండల, విలేకరి మాల్యం కిరణ్ కుమార్(శుభోదయం న్యూస్):**



కనేకల్ మండల పరిధిలోని మాల్యం గ్రామంలో మంగళవారం రోజున వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య అందుకుండా పోతుందని ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్ కు సన్మానం.

**కనేకల్ మండల, విలేకరి మాల్యం కిరణ్ కుమార్(శుభోదయం న్యూస్):**



ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్గా నియామకమైన యు ఆనంద్రాజును టిడిపి నాయకులు శ్రేణులు ఘనంగా సన్మానించారు మంగళవారం కనేకల్ క్రాసింగ్ లోని ఆయన నివాసం వద్ద చేరుకున్న టిడిపి నాయకులు కేక్ కట్ చేసి శాలువా పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు రాష్ట్ర ప్రభుత్వం టిడిపికి ఆనంద్రాజ్ చేసిన సేవలను గుర్తించి డైరెక్టర్గా నియమించడం హర్షనీయమని కొనియాడారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఆనంద్రాజు కు పదవి అందించేందుకు కృషిచేసిన విప్ కాలువ శ్రీనివాసులకు, ప్రభుత్వానికి టిడిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లాలేప్ప, చంద్రశేఖర్ గుప్త, బీటీ రమేష్, మాబు సాబ్, ఫక్రుద్దీన్, చాంద్ భాషా, హరి, వన్నూరు స్వామి, టిడిపి కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో మౌలానా అబ్దుల్ కలాం చేసిన సంస్కరణలు మరువలేనివి

**గుంతకల్, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):**




మూలన అబ్దుల్ కలాం ఆజాద్ విద్యారంగంలో చేసిన సేవలు మరువలేనివని ఎస్కేపి ప్రభుత్వం డిగ్రీ కళాశాల అధ్యాపకులు కొనియాడారు మంగళవారం మౌలానా అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన సమాజంలో అధ్యాపకులు మాట్లాడుతూ కలాం తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో పలు సంస్కరణలకు తెర లేపారని కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ ఎన్సిసి అధికారి బాలకృష్ణ కెమిస్ట్రీ అధ్యాపకులు జాకీర్ హుస్సేన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# త్రిపురాంతకం మండలంలోని పొలం పిలుస్తుంది కార్యక్రమం

**త్రిపురాంతకం మండల, రిపోర్టర్- గుత్తా మూర్తేయ్య (శుభోదయం న్యూస్):**




త్రిపురాంతకం మండలంలోని త్రిపురాంతకం మరియు లేళ్లపల్లి గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరమణ మరియు మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వరరెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట రమణ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పండించే పంటల గురించి అడిగి తెలుసుకున్నారు.అలాగే లేళ్లపల్లి గ్రామంలో కంది, మిరప పంటలను పరిశీలించారు .మిరప పంటలో నల్లిని గమనించి,నల్లి నివారణకు ముందస్తు చర్యగా పసుపు, బ్లూ రంగు జిగురు అట్టలు తగిలించు కోవాలి అని సూచించారు.దాని వలన కొంత వరకు పురుగు ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు, అదే విధంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి రైతు మోతదుకు మించి ఎరువులు వాడరాదు అని తెలపటం జరిగింది, ఎక్కువ మోతదులో ఎరువులు వాడటం ద్వారా పురుగుల ఉధృతి ఎక్కువ అయి పంటకు నష్టమే కానీ లాభం చేకూరదు అని తెలిపారు. అదే విధంగా వ్యవసాయ అధికారి బి.సంగమేశ్వర రెడ్డి త్రిపురాంతకం గ్రామంలో వరి పంటను పరిశీలించటం జరిగింది. వరి పంటలో కాండం కుళ్ళు తెగ్గులు, అగ్గి తెగులను గమనించటం జరిగింది.కాండం కుళ్ళు తెగుళ్ల నివారణకు హెక్సకోనజోలే 2.5 మి. లి లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి అని తెలిపారు. పంటలో అగ్గి తెగులు ఎక్కువ గా ఉన్నట్లయితే ట్రైసైక్లోజోల్ 75% ఎప్ ను ఎకరానికి 125 గ్రాములు పిచికారీ చేసుకోవాలి అని సూచించటం జరిగింది. అదే విధముగా రబీ సాగు చేసే రైతులకు మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు 30% సబ్సిడీ అని తెలిపారు. ధర కిలో 98 రూపాయలు అని తెలపటం జరిగింది. కావలసిన రైతులు స్థానిక రైతు సేవ కేంద్ర సిబ్బంది ని సంప్రదించండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం నీటి సంఘం చెరువు ప్రెసిడెంట్ మోటకట్ల రామిరెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ అబిద్ హుస్సేన్ ,పర్వీన్ బేగం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏలీయా, ఐ సి ర్ పి లు మరియు గ్రామ రైతులు,పెద్దలు పాల్గొన్నారు.

# రైతాంగం,కార్మిక డిమాండ్స్ పరిష్కారం కోసం ఐక్య ఉద్యమం

**26న ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా.**

**ఏలూరు జిల్లా, ప్రతినిధి- ప్రసాద్ (శుభోదయం న్యూస్):**




రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం పిలుపు. ఏలూరు ఈనెల 26 రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా రైతాంగం,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త పిలుపుమేరకు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం పిలుపునిచ్చింది మంగళవారం ఏలూరు అన్నే భవనంలో రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం బి కే ఎం యు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్కే గౌస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్కే మున్ని, రైతు సంఘం నాయకులు తక్కెళ్ళపాటి ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా లిఖితపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు రైతాంగం, కార్మికులు,ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.14.65 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగానికి ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదని చెప్పారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ధర్నా జయప్రదం కోరుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం చేయాలని కోరారు.కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను, గిరిజన వ్యతిరేక అటవీ హక్కుల చట్టం సవరణలను రద్దు చేయాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనులు 200 రోజులు పెంచాలని, కనీస వేతనం రూ. 600 ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ నెలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు.2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 10వేలు పింఛన్ పథకం అమలు చేయాలన్నారు.మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

**ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్):**



దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( ఏపిడబ్ల్యూజేఎఫ్ ) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 23వ తేదీన జరగనున్న జర్నలిస్టుల కార్తీక వన సమారాధన మహోత్సవ పోస్టర్ను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ "విలువలతో కూడిన జర్నలిజం ద్వారానే సమాజానికి మరింత మేలు జరుగుతుంది అని, కొందరి స్వార్థ ప్రయోజనాల వల్ల, అసత్య కథనాల వల్ల మీడియా పట్ల సమాజంలో నానాటికి దిగజారిపోతున్న గౌరవాన్ని తిరిగి నిలబెట్టి, ప్రజల్లో అభిమానాన్ని, నమ్మకాన్ని చూరగొనెల జర్నలిస్టులు కృషి చేయాలని, నిస్వార్థంగా ప్రజల కోసం పని చేస్తూ, ప్రజలకు సమాచారం అందించటం కోసం తాపత్రయ పడుతూ ఎంతో మంది జర్నలిస్టులు తమ జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారని, చేస్తున్నారని, అటువంటి ప్రతి జర్నలిస్టు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.. నిరంతరం పని ఒత్తిడిలో జీవించే జర్నలిస్టులకు ఈ విధంగా కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించడం వల్ల వాళ్లకి కొంత ఆహ్లాదకరమైన వాతావరణం లభించేలా ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్( ఏపిడబ్ల్యూజేఎఫ్ ) ఏలూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జబీర్,వై.వి హరీష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శేఖర్, కళ్యాణ్, సత్య నారాయణ, మెల్టన్ శ్రీనివాస్ నాగేశ్వరరావు దొరబాబు సన్నీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మౌలానా అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

**గుమ్మనూరు నారాయణస్వామి**

**గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):**




దేశ తొలి విద్యాశాఖ మంత్రి గా మౌలానా అబ్దుల్ కలాం సేవలు మరువలేనని గుమ్మునూరు నారాయణస్వామి పేర్కొన్నారు కలాం జయంతి సందర్భంగా మంగళవారం ధర్మవరం గేట్ వద్ద ఉన్న అబ్దుల్ కలాం ఆజాద్ ఆయన పూలమాల వేసే ఘనం గా నిర్వహించారు ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి మార్గాలను ఎంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వేద వ్యాసు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ముస్లిం మైనారిటీ నాయకులు గుజిరి ముహమ్మద్ ఖాజా,ఫజుల్ రెహ్మాన్, సద్దాం హుస్సేన్, పామిడి మస్తాన్, టెంకాలు యూసఫ్,కె వలీ భాషా, ఫ్రూట్ మస్తాన్, అంబులెన్స్ షమీర్, పొట్టిపాడు మహబూ,ఆటో సాదిక్, ఫాజులుఖాన్ అల్లాహబక్ష్,నబీ రఫీ కూటమి నాయకులు హిమబిందు, రామన్నచౌదరి అంజి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ తలారి మస్తానప్ప సంజీవ్ రాయుడు,కౌన్సిలర్లు రవి కుమార్ సుధాకర్ ప్రభాకర్ నందీశ్వర వీరేష్ చిప్పిగిరి ప్రతాప్ యుగంధర్, రామరాజు,సప్లయర్ హనుమంతు శివన్న కృష్ణనాయక్ చంద్రయ్య అశోక్,బసవరాజ్,ఎర్రన్న,గిడ్డయ్య,చకిల్ సీనా పులికొండ, కనిగివిటి మోహన్,హరి చామండి, మున్నయ్య, కె ల్ సిన, మధు వాసు ఉమా రాయల్ వెంకటేష్ పెంచల పాడు వెంకటేష్ బీజేపీ నాయకులు కొలిమి రామాంజినాలు, గుర్రంసూర్యనారాయణ విజయలక్ష్మీ, జయలక్ష్మి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బస్టాండ్ ప్రాంగణం పారిశుద్ధ్య నిర్లక్ష్యంపై మాజీ చైర్ పర్సన్ ఇమ్మని రాజేశ్వరి అసహనం

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్):

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం బస్టాండ్ ప్రాంగణం అధ్వానంగా ఉందని సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం వలన పారిశుద్ధ్యం నిర్వీర్యంగా మారిందని జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ ఇమ్మణి రాజేశ్వరి అసహనం వ్యక్తం చేశారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆమె మంగళవారం బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. బస్టాండు ప్రాంగణంలోకి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు చేరుకున్నాయని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గతంలో ఆర్టీసీ అధికారులకు సూచించానన్నారు. వారు 48 గంటల వ్యవధిలో సమస్య పరిష్కరిస్తామన్నారని, కానీ వారం రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రయాణికులు బస్ స్టాండ్ లోకి రాలేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కే సురేష్ తో చర్చించి తాత్కాలికంగా నైనా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలో డివిజన్, జిల్లాస్థాయి ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆమె ఫోన్లో సంప్రదించారు. 14వ తేదీకి సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు



చేయాల్సి ఉంటుందని, ఆమె హెచ్చరించారు. నందనవనంలా ఉన్న ఒకప్పటి బస్సు స్టాండ్ గత రెండు సంవత్సరాలుగా నిరాదరణకు గురవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొన్న బైక్ ఒకరు మృతి

పిడుగురాళ్ల టౌన్, రిపోర్టర్ శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్):




పల్నాడు జిల్లా కారంపూడి నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుని కారంపూడి వైపు బైక్ పై వెళ్తున్న వ్యక్తి బలంగా ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే బైకిస్టు మృతి చెందిన సంఘటన కారంపూడి జూలకల్లు మధ్య ప్రాంతంలో జరిగింది.. ప్రమాదం తాలూకా వివరాలు మరియు మృతుడు తాలూకా వివరాలు తెలియాల్సి ఉంది ? బైక్ పై వెళ్తున్న వ్యక్తి ఎదురుంగా వస్తున్న ఆర్టిసి బస్సుని బలంగా ఢీకొట్టడంతో తలకి బలమైన గాయం అవ్వడంతో ఘటనా స్థలంలో మృతి చెందినట్లు తెలుస్తోంది.

## వైఎస్ఆర్ సీపీ పార్టీ కార్యకర్తని పరామర్శించిన బి పామూరు మండలం వైఎస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):

పామూరు మండలంలోని వగ్గంపల్లి పంచాయతీలో కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లితేలుకుట్ల శ్రీనివాస్ యాదవ్ 55 ఏళ్ల అనారోగ్యంతో బాధ పడుతూ ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న పామూరు మండలం వైఎస్ఆర్ సీపీ పార్టీ నాయకులు పరామర్శించడం జరిగింది శ్రీనివాస్ యాదవ్ గారు త్వరగా కోలుకొని చురుకుగా పార్టీ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పామూరు మండలం వైఎస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి ప్రకాశం జిల్లా టీచర్ల విభాగం అధ్యక్షులు కల్లూరి రామిరెడ్డి గారు సీనియర్ నాయకులు గట్ల విజయ భాస్కర్ రెడ్డి గారు, శ్రీరామ్



శ్రీనివాసులు,తుపాకుల ఆంజనేయ రెడ్డి ,మిరియం రామారావు, మద్దులూరి మహేష్ యేలిక అచ్చయ్య, గంగిరెడ్డి వెంకట రెడ్డి ,వాకమల్ల కోటి రెడ్డి, మన్నం మాధవ, గంధం ఏలియేజర్ ,డబ్బుగొట్టు శివ, సైయ్యద్ మహమ్మద్ రఫీ,. పాల్గొన్నారు

## 12 వ తేదీ (రేపు) కనిగిరి లో జరిగే 'ప్రజా ఉద్యమ' నిరసన ర్యాలీ ని విజయవంతం చేయండి పామూరు మండలం వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ సీపీ అధినేత వైయస్ జగన్ మెహన్ రెడ్డి గారిలి ఆదేశాల మేరకు నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారిలి ఆధ్వర్యంలో కనిగిరి లో 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై నిరసన తెలియజేయడానికి నవంబర్ 12వ తేదీన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఉదయం 9:30 గంటలకు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ గారి ఇంటి వద్ద నుండి పామూరు బస్టాండ్, చెప్పుల బజారు, ఎంఎస్ఆర్ రోడ్డు,వైయస్ఆర్ రోడ్డు మీదుగా ఆర్డిఓ ఆఫీస్ వరకు ఈ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు ప్రజా ఉద్యమ నిరసన ర్యాలీ కార్యక్రమానికి జరుగును పామూరు మండలం వైఎస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నాయకులు అభిమానులు ప్రజలు విద్యార్థులు, ప్రజాసంఘాల వారు మరియు కార్యకర్తలు, అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి పామూరు వైఎస్ఆర్సీపీ పార్టీ ఆఫీస్ నందు పామూరు మండలం వైఎస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమ' నిరసన ర్యాలీ సంబంధించిన పోస్ట్ విడుదల చేసిన వైఎస్ఆర్ సీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా టీచర్ల విభాగం అధ్యక్షులు కల్లూరి రామిరెడ్డి గారు, సీనియర్ నాయకులు గట్ల విజయ భాస్కర్ రెడ్డి గారు, సీనియర్ నాయకులు షేక్ చాంద్ బాషా గారు (బుజ్జి భాయ్) షేక్ నాయాబ్ రసూల్ షేక్ గయాజ్ శ్రీ రామ్ శ్రీనివాసులు



తాతపూడి రాము పోతుల రమేష్ తుపాకుల ఆంజనేయ రెడ్డి పిరికిటి వెంకట నారాయణ మిరియం రామారావు గడ్డం వెంకట నారాయణ రెడ్డి కోట వెంకట కృష్ణా రెడ్డి కరణం వెంకట నారాయణ రెడ్డి కోట వెంకట కృష్ణా రెడ్డి కందుల వెంకట నారాయణ రెడ్డి షేక్ షబీర్ పోలు మల్లి ఖార్జున రెడ్డి తుమ్మ పిచ్చి రెడ్డి కోటపాటి రమణా రెడ్డి యేలిక అచ్చయ్య మొరుబోయిన రాధా కృష్ణ వేముల గురు స్వామి షేక్ రసూల్ ఖాన్ భవానీ వెంకటేశ్వర్లు కోడూరి రామ సుబ్బారెడ్డి దండు నారాయణ రెడ్డి గడ్డి పెద మహా లక్ష్మయ్య మూలే కోటి రెడ్డి గాజులపల్లి కోటి బాబు .పోలు మోహన్ .మేడబలిమి రాధాకృష్ణ వేముల గురు స్వామి. షేక్ రసూల్ బోయళ్ల మల్లి ఖార్జున కరేడు తిరుపతయ్య షేక్ నాగూర్ బాషా షేక్ నాయబ్ రసూల్ చాకలకొండ రామదాసు దాసరి సత్యం యెండ్లూరి సల్మాన్ కర్ర కృపా ధనం నీరుకట్టు కొండల రావు పోలుబోయిన నరసింహారావు గుంటగాని నాగేశ్వరరావు చిట్టెటి చిన్న డబ్బుగొట్టు శివ మర్రి రాజు రాచకొండ మహేంద్ర చప్పిడి గంగా శేఖర్ బుచ్చి వెంకటేశ్వర రెడ్డి చింతంబుడి చింతకొబ్బరి వెంకటేశ్వర రెడ్డి చింతమనేని బలిరాజు బుచ్చి వెంకటేశ్వర రెడ్డి. మిరెకల యర్రా గురవయ్య వెగ్గళం బాల బ్రహ్మం నాగి రసూల్ పాలేటి ప్రేమ్ కుమార్ షేక్ ఆరిఫ్ మిరియం పరమేశ్వరరావు ఇర్రి వెంకటేష్ కసిరెడ్డి శ్రీనివాస రెడ్డి పిక్కిలి మస్తానయ్య యాట వీర స్వామి నల్లమల అనిల్ యోహాన్ గాజులపల్లి శ్రీనివాస రెడ్డి ఉడుముల కృష్ణా రెడ్డి,షేక్ కాసిం,రాచకొండ మధు. పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లింగన్నపాలెం పర్యటన సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ గృహనిర్బంధం

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):

సోమవారం ఒంగోలుకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంటికి రాగానే కానిస్టేబుల్ ఇంటి వద్ద కాపలా పెట్టి బయటకు రానివ్వకుండా గృహ నిర్బంధించడం సరైనది కాదని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నాలుగువేల కోట్లు నిధులు కేటాయించి పూర్తి చేసి పశ్చిమ ప్రాంతాన్ని కరువు నుండి విముక్తి చేయాలని, పీ సి పల్లి మండలానికి ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని, పీసీపల్లి, పామూరు మండలాల కిడ్నీ బాధితులను ఆదుకోవాలని, ప్రతి కుటుంబానికి త్రాగునీరు ఉచితంగా సప్లై చేయాలని, త్రిబుల్ ఐటీ పామూరు మండలం దూబగుంట్ల గ్రామంలో నిర్మించాలని, నింజు పరిశ్రమలు నెలకొల్పి నియోజకవర్గ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని,రైల్వే నిర్మాణానికి నిధులు కేటాయించి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, డిమాండ్స్ తో కుడిన వినత పత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి అందజేయడానికి ప్రయత్నం చేస్తామని ఇంటిలిజెన్స్ అధికారులు ఫోన్ చేసి అడుగుగా పై సమస్యల మీద అర్జీ ఇస్తాం అని చెప్పగా ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంగళవారం గృహనిర్బంధం చేశారు. సిపిఎం నాయకులను ఇంటి నుండి సిపిఎం ఆఫీసుకు వెళతాం అన్న రానివ్వకుండా ఇంట్లోనే ఉండాలని పై అధికారులు చెప్పారని కానిస్టేబుల్ అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కే మాల్యాద్రి శంకర్ ఉన్నారు. గృహ నిర్బంధంలో ఉన్న సిపిఎం నాయకులు.



## అంగరంగ వైభవంగా చింతలపూడి ఏఎంసి చైర్మన్ మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం, చింతలపూడి ఎ.ఎమ్.సి చైర్మన్ గా నూతనంగా ఎన్నుకోబడిన చీదరాల దుర్గపార్వతి మధుబాబు, మరియు డైరెక్టర్ ల ప్రమాణస్వీకారం చింతలపూడి ఎ.ఎమ్.సి లో చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల.మనోహర్ పాల్గొని నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు అందుబాటులో ఉంటూ ఎ.ఎమ్.సి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొల్లిశెట్టి.శ్రీనివాసరావు, ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ఆర్.టి.సి చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ,వడ్డీ సంక్షేమ అభివృద్ధి చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి మేక ఈశ్వరయ్య, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత నాటు సారాయి కేసులో నిందితురాలిపై బైండ్ ఓవర్ కేసు

ఏలూరు జిల్లా, ప్రతినిధి- ప్రసాద్(శుభోదయం న్యూస్):



డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఏలూరు జిల్లా శ్రీ.ఆవులయ్య ఆదేశాలు ప్రకారము ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, చింతలపూడి స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది సంయుక్తంగా కలిసి ఎక్సైజ్ నేరములు కొరకు లింగపాలెం మండలం, ధర్మాజీ గూడెం గ్రామము లో ఎక్సైజ్ నేరములు అనధికార మద్యం షాపులు (బెల్ట్ షాపు) నిర్వాహకుల పై దాడులు నిర్వహించగా చిన్నం నాగమణి అను మహిళ వద్ద నుండి 180 పరిమాణం కలిగిన (19) డ్యూటీ పెయిడ్ (డీపీల్) మద్యం సీసాలను స్వాధీన పరచుకొని, ఆ మహిళ పై కేసు నమోదు చేయడమైనది! అలాగే లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలోని పాత నాటు సారాయి కేసులో నిందితురాలు అయిన నత్తా రాములమ్మ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లింగపాలెం వారి ఎదుట బైండ్ ఓవర్ చేసిన బాండ్ ను ఉల్లంఘించిన కు గాను తహసీల్దార్ వారు విధించిన రూ:3000/- అపరాధ రుసుము ను ప్రభుత్వమునకు చలానా రూపము లో చెల్లించారు ఈ దాడులలో ఎన్ఫోర్స్మెంట్ సి.ఐ ఫణి కుమార్ , ఏలూరు స్టేషన్ స్టేషన్ ఎస్.ఐ. గౌరీ శంకర్, సిబ్బంది మరియు స్థానిక చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్. ఐ. అబ్దుల్ ఖలీల్, మరియు సిబ్బంది పాల్గొన్నారని చింతలపూడి ఎక్సైజ్ సి. ఐ పి.అశోక్ తెలియజేశారు

## కార్తీక సోమవారం సందర్భంగా శ్రీశ్రీశ్రీ దప్పిలేస్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):

బద్వేల్ మండల పరిధిలోని నక్కలగండి సమీపంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ దప్పిలేస్వరి అమ్మవారి సన్నిధిలో కార్తీక సోమవారం సందర్భంగా అమ్మవారికి అంగరంగ వైభవంగా శ్రీ సాయి వసుధ ట్రస్ట్ చైర్మన్ సొదరి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వేకువ జామునుండే అమ్మవారికి ప్రత్యేక పూలతో అమ్మవారి అలంకరణలతో అమ్మవారి సన్నిధిలో సంబరాలు కన్నుల పండుగగా నిర్వహించారు.. ఈ సందర్భంగా సోదరీ వెంకటసుబ్బారెడ్డి గారు మాట్లాడుతూ మూడవ కార్తీక సోమవారం సందర్భంగా శ్రీ పార్వతీ పరమేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలకు కలగాలని ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకోవడం జరిగిందన్నారు...





# మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి కాంబోలో 'మెగా 158' సెన్సేషన్ ఆయన చేరికతో హైప్ డబుల్!

మెగాస్టార్ చిరంజీవి వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే 'విశ్వంభర' షూటింగ్ దాదాపు పూర్తిచేసిన ఆయన, ప్రస్తుతం 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి ఫైనల్ టచ్ ఇస్తున్నారు. ఈ సినిమా పూర్తైన వెంటనే మరో భారీ ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం దర్శకుడు బాబీ కొల్లి డైరెక్షన్‌లో తెరకెక్కనుంది. ప్రస్తుతం 'మెగా 158' ప్రచారం జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా సినిమాగా రూపొందనుంది. ఈ సినిమా కాస్టింగ్, టెక్నీషియన్ల ఎంపికలపై గత కొద్ది రోజులుగా ఫిలింసర్కిల్స్‌లో జోరుగా చర్చ నడుస్తోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. 'మెగా 158' సినిమాకి మాలీవుడ్ టాప్ డీఓపీ నిమిష్ రవి సినిమాటోగ్రఫీ నిర్వహించనున్నారని సమాచారం. 'లుకా', 'రోర్‌షాక్', 'కురుప్', 'కింగ్ ఆఫ్ కొట్టా' వంటి మలయాళ చిత్రాలతో అద్భుతమైన విజువల్స్ అందించిన నిమిష్, టాలీవుడ్‌లో 'లక్కీ భాస్కర్' ద్వారా ఎంట్రీ ఇచ్చారు. ఇటీవల భారీ విజయం సాధించిన 'లోకా చాప్టర్ 1' చిత్రానికి కూడా ఆయనే సినిమాటోగ్రాఫర్. ఇప్పుడు ఈ ప్రతిభావంతుడైన టెక్నీషియన్ చిరంజీవి - బాబీ ప్రాజెక్ట్‌తో జాయిన్ అవుతుండటంతో సినిమా హైప్ మరింత పెరిగింది. 'మెగా 158'లో ఇద్దరు హీరోలు కనిపించనున్నారని, అందులో ఒకరుగా తమిళ హీరో కార్తీ ఉండబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా నటించే అవకాశం ఉందని టాక్. హీరోయిన్‌గా మాళవిక మోహనన్ పేరు వినిపించినా, ఆమె దీనిని ఖండించింది. సంగీత దర్శకుడిగా మొదట ఎస్. థమన్ పేరు వచ్చినా, తరువాత దేవిశ్రీ ప్రసాద్ కూడా రేసులో ఉన్నారని ప్రచారం. వీరిలో ఎవరు ఫైనల్ అవుతారో త్వరలో తెలుస్తుంది. చిరంజీవి %-% బాబీ కాంబోలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' 2023 సంక్రాంతికి భారీ హిట్‌గా నిలిచింది. రూ.230 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ఆ సినిమా తర్వాత, వీరిద్దరి కాంబోపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ చిత్రాన్ని ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

# అల్లరి నరేశ్ క్రైమ్ థ్రిల్లర్.. ట్రైలర్ వచ్చేసింది



కామెడీ సినిమాలతో అభిమానులను అలరించిన హీరో అల్లరి నరేశ్. అయితే గత కొంతకాలంగా తన ట్రెండ్‌కు భిన్నంగా మాస్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఉగ్రం, బచ్చలమల్లి చిత్రాలతో తన ట్రాక్ మార్చాడు. అయితే ఈ చిత్రాలేవీ ఆయనకు పెద్దగా కలిసి రాలేదు. అయినా మళ్లీ అదే ట్రాక్‌లో వెళ్తున్నారు. ఈ సారి మాస్‌కు భిన్నంగా క్రైమ్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా అల్లరి నరేశ్ నటించిన క్రైమ్ అండ్ హారర్ థ్రిల్లర 12ఏ రైల్వే కాలనీ ఈ చిత్రాన్ని నాని కాసరగడ్డ దర్శకత్వంలో తెరకెక్కించారు. పొలిమేర చిత్రాల డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ అందించారు. ఈ చిత్రంలో పొలిమేర ఫేమ్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రం నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తే కథ మొత్తం మర్డర్ కేసు చుట్టే తిరగనున్నట్లు తెలుస్తోంది. ఓ హత్య కేసు ఆధారంగా ఈ సినిమాను రూపొందించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనీష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషించారు.

# 3,800 హార్ట్ సర్జరీలకు ఆర్థిక సాయం.. గిన్నిస్ బుక్‌లో బాలీవుడ్ సింగర్



బాలీవుడ్ ప్రముఖ గాయని పలక్ ముచ్చల్ తన మంచి మనసుతో గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. ఆర్థిక సాయం అందక గుండె సమస్యలతో బాధపడుతున్న దాదాపు 3,800 మందికి పైగా పేద పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేయిందేందుకు నిధులు సమకూర్చి గిన్నిస్ బుక్‌లో కెక్కింది సింగర్. పలక్ పలాష్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చి నిరుపేద పిల్లలకు హార్ట్ సర్జరీలు చేయించింది ఈ సింగర్. అయితే ఈ విషయంపై ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సింగర్.. తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పలక్ ముచ్చల్ ఇండోర్‌లో జన్మించింది. ఒకసారి రైలు ప్రయాణంలో పేద పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన పలక్.. నిరుపేద చిన్నారుల కోసం ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ఈ సేవా సంస్థను స్థాపించింది.



# నిశ్చితార్థం గురించి అఫీషియల్‌గా చెబుతారా?

పాన్ ఇండియా సెన్సేషన్ హీరోయిన్ రష్మిక.. గత 11 నెలల్లో ఐదు విభిన్నమైన సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. రీసెంట్‌గా అయితే 'ద గర్ల్‌ఫ్రెండ్' మూవీతో వచ్చింది. దీనికి అన్నివైపుల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. ఇప్పుడు ఈ మూవీని సపోర్ట్ చేసేందుకు రష్మిక కోసం స్వయంగా విజయ్ దేవరకొండ కూడా రాబోతున్నాడు. గర్ల్‌ఫ్రెండ్' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా మాట్లాడిన నిర్మాత అల్లు అరవింద్.. సక్సెస్ మీట్‌కు విజయ్ దేవరకొండని తీసుకొస్తానని అన్నారు. ఇప్పుడు అదే జరగబోతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో బుధవారం సక్సెస్ ఈవెంట్ నిర్వహించబోతున్నారని టాక్. సాధారణంగా చూస్తే ఇందులో పెద్ద విషయమేం ఉండదు. కానీ గతకొన్నాళ్లుగా రిలేషన్‌లో ఉన్న వీళ్లిద్దరూ.. కొన్నాళ్ల క్రితమే రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ విషయం అనధికారికంగా బయటకొచ్చినా విజయ్ గానీ రష్మిక గానీ బయటపడట్లేదు. ఎంగేజ్‌మెంట్ రూమర్స్ తర్వాత విజయ్-రష్మిక కలిసి తొలిసారి స్టేజీపై కనిపించబోతున్నారు. మరి ఇద్దరిలో ఎవరైనా ఈ విషయం గురించి మాట్లాడుతారా అనేది చూడాలి? మరోవైపు విజయ్-రష్మికల పెళ్లి గురించి కూడా అప్పుడే రూమర్స్ వచ్చేస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోనున్నారని అంటున్నారు. ఇప్పుడు కనిపించబోతున్న ఈవెంట్‌లో వివాహం గురించి కూడా ఏమైనా హింట్ ఇస్తారా అనేది చూడాలి.

# నాలుగు డ్యాన్స్ స్టెప్పులు, ఏవో డైలాగ్స్ ఇకపై అలా చేయను



నేను తెలుగు తమిళంలో స్టార్ హీరోలతో నటించాను. పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, నాని, నాగ చైతన్య, శివకార్తికేయన్, కార్తి, విశాల్..ఇలా హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నాను. అయితే నా కెరీర్ లో కొన్ని సినిమాలు చేసి ఉండకూడదు అని ఇప్పుడు రిగ్రెట్ ఫీల్ అవుతున్నా. కొన్ని కమర్షియల్ మూవీస్ లో నటించడం వల్ల నటిగా నాకు ఎలాంటి సంతృప్తి లభించదు. నాలుగు డ్యాన్స్ స్టెప్స్ వేసి, ఏవో డైలాగ్స్ చెప్పిస్తారు. ఈ రొటీన్ మూవీస్ చేసేప్పుడు నేను రియలైజ్ కాలేదు గానీ ఇకపై అలాంటి మూవీస్ చేయకూడదు అని నిర్ణయించుకున్నా' అని అన్నారు హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్. ఈ బ్యూటీ కీలకపాత్రలో, రష్మిక-దీక్షిత్ శెట్టి జంటగా నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' మూవీ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దుర్గ అనే క్యారెక్టర్‌లో అను నటించింది. ఈ మూవీకి హిట్ టాక్ వచ్చిన నేపథ్యంలో తాజాగా అను మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అనుభవాలతో పాటు తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా కోసం మొదట ప్రొడ్యూసర్ ధీరజ్ నుంచి కాల్ వచ్చింది. ఆ తర్వాత రాహుల్ కలిసి స్క్రిప్ట్ చెప్పారు. స్క్రిప్ట్, నా క్యారెక్టర్ గురించి విన్న తర్వాత తప్పకుండా ఈ మూవీలో నటించాలని అనిపించింది. అమ్మాయిల గురించి ఒక మంచి విషయం చెప్పే మూవీ ఇది. ఈ చిత్రంలో నటించడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఇది గీతా ఆర్ట్స్ సినిమా కాబట్టి బాగా చూసుకుంటారనే నమ్మకం ఉంది. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాకు వస్తున్న రెస్పాన్స్ హ్యాపీగా ఉంది. అయితే నేను ఏ సినిమా చేసినా ఆ మూవీకి ఎలాంటి ప్రశంసలు వస్తాయని ఆశించను. ఈ చిత్రంలో దుర్గ క్యారెక్టర్ లో నటించాను. ఫస్టాఫ్ లో కొన్ని సీన్స్ చూస్తున్నప్పుడు నా క్యారెక్టర్ ను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే భయంవేసింది. కానీ ఆ తర్వాత డైరెక్టర్ రాహుల్ నా క్యారెక్టర్ ను తీర్చిదిద్దిన విధానంతో హ్యాపీగా ఫీలయ్యా. రాహుల్ చాలా సెన్సిటివ్ డైరెక్టర్. నా క్యారెక్టర్ ఒక్కటే కాదు, అన్ని పాత్రలను చేయి పట్టి నడిపించారు. కమర్షియల్ మూవీస్ లో మాతో ఓవర్ యాక్షన్ చేయిస్తారు. ఈ చిత్రంలో నాకు అవకాశం వచ్చేసరికే రష్మికను భూమా పాత్రకు తీసుకున్నారు. నేను భూమా పాత్రలో నటించాలని ఎప్పుడూ అనుకోలేదు. హాలీవుడ్ లో మూవీస్ చూస్తే హీరో హీరోయిన్ విలన్ ఇలా విభజన ఉండదు. ప్రతి ఒక్కరూ కథకు కాంట్రిబ్యూట్ చేసేలా క్యారెక్టర్స్ చేస్తారు. ఈ చిత్రంలో రాహుల్ అలాంటి ప్రయత్నమే చేశారు. అన్ని పాత్రలను జస్టిఫై చేసేలా మూవీ రూపొందించారు. నా కెరీర్ పరంగా అసంతృప్తిగానే ఉన్నా, అయితే నటిగా సంతృప్తి ఉంది. పెద్ద పెద్ద స్టార్స్ తో కలిసి నటించాను. అయితే నాది అవకాశాల కోసం ఆరాటపడే తత్వం కాదు. నాకు వచ్చే సినిమా తప్పకుండా దక్కుతుందని నమ్ముతా. ప్రొడ్యూసర్ ధీరజ్ తో గతంలో ఊర్వశివో రాక్షసివో సినిమా చేశాను. "ది గర్ల్ ఫ్రెండ్" లాంటి చిత్రాలు వర్కవుట్ కావాలంటే ధీరజ్ లాంటి మంచి ప్రొడ్యూసర్ ఉండాలి. మంచి టీమ్ కుదరకే గతంలో కొన్ని ఫీమేల్ సెంట్రిక్ మూవీస్ ఆదరణ పొందలేకపోయాయి. ప్రస్తుతం కొన్ని ప్రాజెక్ట్స్ డిస్కషన్స్ స్టేజ్ లో ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేను.